# దీపిక

"ఏమిటీ... రచయిత గోపాలకృష్ణ మీరేనా....!" అంటూ ఆశ్చర్యపోయింది దీపిక. ఆశ్చర్యాన్ని ఒక్క క్షణంలో నిషాదం కమ్మేసింది. ఆ వెంటనే మనసులో చెలరేగుతున్న ఆందోళనను తట్టుకోలేకపోయింది.

ఎర్రబడుతూన్న కళ్ళలోకి ఉబికుబికి రాబోతున్న కన్నీళ్ళూ, మండుతూన్న గుండెలోనుండి ఉరికురికి ముక్కుపుటాల ద్వారా గుప్పుమనబోతూన్న ఆవిరులూ, భగభగమంటూన్న రంగులూ... గబుక్కున లేచి బాత్‌రూమ్‌కేసి వెళ్ళింది దీపిక.

అక్క జీవితం.... అక్క రూపం... అక్క ఆశలూ...

మాడి మసైపోతే-

వింటూ చూస్తూ ఏమీ చేయలేని తన అశక్తత, నిస్సహాయత, చేతగానితనం ఇన్నాళ్ళకి మళ్ళీ జ్ఞాపకానికొచ్చాయి. కళ్ళలోంచి కడుపులోని బాధను కసిగా కారనిచ్చింది. గుండెల్లో మంటను కక్షకొద్దీ ముఖం నిండా పరుచుకోనిచ్చింది.

పావుగంట గడిచేక శుభ్రంగా ముఖం కడుక్కుని తాజాగా వచ్చి స్టాఫ్ రూములో కూర్చుంది దీపిక.

"ఈ స్కూలుకి మీరొచ్చి మూణ్ణెల్లే కదా అయ్యింది. అంచేత మీకు తెలియకపోవచ్చు గాని నాపేరు కె. గోపాలకృష్ణమూర్తి అయినా స్కూలు రికార్డుల్లో కే. జీ. కృష్ణమూర్తి అని వుంటుంది. పోతే రచనలు మాత్రం గోపాలకృష్ణ పేరుతో చేస్తుంటాను." అని వివరిస్తున్నాడు కృష్ణమూర్తి.

ఈలోగా బెల్లయ్యింది.

"మీ రచనల గురించి తర్వాతెప్పుడైనా తీరిగ్గా చర్చించాలి. మీరే గోపాలకృష్ణ

అని తెల్సిన తర్వాత వదుల్తాననుకున్నారా?" అంది దీపిక లేస్తూ.

ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు కృష్ణమూర్తి.

"తప్పకుండాను. మీరెప్పుడూ నన్ను వదిలిపెట్టకూడదనే నేనూ కోరుకుంటున్నాను." నవ్వుతూ పొంగిపోతూ అన్నాడు కృష్ణమూర్తి.

బెల్ కావడంతో మరిన్ని మాటలు ఆశించిన కృష్ణమూర్తికి నిరాశే ఎదురయ్యింది. గుండెల్లో సందళ్ళకూ ముఖంలోని రంగులకూ పొంతన కుదర్చలేకపోతూన్న దీపికకు నిట్టూర్పే మిగిలింది.

క్లాసులో కూర్చున్న దీపిక గుండెల్లో చెలరేగుతూన్న సంచలనాన్ని తట్టుకోలేకపోతోంది. పిల్లలకి ఏవో రాయమని చెప్పి తెరలు తెరలుగా వస్తున్న దుఃఖానికి కారణమవుతున్న ఆలోచనలకే తావిచ్చింది.

ఎంత సేపటినుండో మనసులో ఏ మూలనో చిన్నగా మెదులుతూన్న అక్క రూపం విశ్వరూపం దాల్చి ఎదుట నిల్చింది.

రాధిక!

అవునెంత చక్కనిదెంత చల్లని మనసుది!

ఏదా చక్కని రూపం? ఏమైపోయిందా చల్లని మనసు?

పిచ్చిగా పత్రికలు చదివేది. వేలం వెర్రిగా గోపాలకృష్ణ కథలను గూర్చి వినేవారికీ మరీ మరీ చెప్పేది.

'మీ(మా) పత్రికలో ప్రచురింపబడ్డ గోపాలకృష్ణగారి కథ నా మనసునెంతో ఆకట్టుకుంది. మరిన్ని కథలు ప్రచురిస్తారని వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నాను.' అంటూ పత్రికలకు రాయడం ప్రారంభించిన ఉత్తరాల తోరణం గోపాలకృష్ణను తాకేవరకూ పెరిగింది.

గోపాలకృష్ణనుండి మొదటిసారిగా ఉత్తరం వచ్చిన రోజున.... రాధిక రాధిక కాదు. గోపాలకృష్ణని దర్శనంతో సంతోషపు కొండెక్కిన గోపిక.

కళ్ళల్లో దీపాలు ఆరిపోలేదూ? వొంట్లోరక్తం ఆవిరులైపోలేదూ? కడుపులో పేగులు తెగిపోలేదూ?

అవునవును.

యవ్వనం, ఉత్సాహం, అందం, ఆనందం ఇంకా ఏవేవి చూసుకుని వేటివేటిని మనసులో నింపుకుని జీవితంలో పరుగులెట్టాలనీ కాలంతో గంతులెయ్యాలనీ అనుకుందో -అవన్నీ ఏమైపోయేయి? మరింక ఏ విషాదం, ఏ కల్మషం, ఏ కన్నీళ్ళూ, ఏ బాధలు తన ఇంట్లోకి, తన కంట్లోకి, తన మనసులోకి, తన వయసులోకి రాకూడదనుకుందో అవన్నీ ఒక్కుమ్మడిగా వచ్చెయ్యలేదూ?

మరటువంటప్పుడు ఈ దీపిక ఏమనుకుందేమనుకుంది? తన కుటుంబాన్ని నామరూపాల్లేకుండా చేసినవాణ్ని చీరెయ్యాలనుకోలేదూ.....? నరికేయాలనుకోలేదూ...? నిలువునా బూడిద చేసెయ్యాలనుకోలేదూ....?

ఈ నాడిప్పుడిక్కడిలా ఎదురయ్యేడు గోపాలకృష్ణ... కృష్ణమూర్తి అవతారంలో

"ఏవిటి దీపికా... లాంగ్‌బెల్లయి చాలా సేపయినా ఏవిటలా కూర్చుని వుండిపోయేరు. ముఖం చూస్తే మధుర స్మృతులేవో కదుల్తూ వున్నట్టున్నాయ్...'

అని కృష్ణమూర్తి అంటున్నాడు కొంటెగా వరండాలోంచి క్లాసులోకి తొంగిచూస్తూ.

మనసులో ఏమున్నా ముసిముసిగా నవ్వింది దీపిక.

అంతేకాదు "మీ గురించే...." అని గోముగా అంది కూడా.

చచ్చేపోయేడా మాటకి కృష్ణమూర్తి. తేరుకునే సరికి అయిదు నిమిషాలు పట్టింది. అతను తేరుకుని చూసేసరికి దీపిక అక్కడ లేదు.

ఒకరోజు స్కూలుకి రాగానే...

"ఒక్కమారిలా వస్తారా..." అన్నాడు కృష్ణమూర్తి. అందరికీ కాస్త దూరంగా

వెళ్ళేరిద్దరూ.

"మీతో పరిచయమయ్యేక మీ గురించిన ఆలోచనల ప్రేరణతో మరిన్ని కథానికలు రాసేను." అన్నాడు మైమరిచిపోతూ.

విని నవ్వింది దీపిక-

"మీతో పరిచయమయ్యేక మరో అమ్మాయితో జీవితాన్ని ఊహించుకోలేకుండా వున్నాను..." తిరిగి అన్నాడు తీయగా.

విని అంది దీపిక-

"మనం పరిచయం కాకపూర్వం అమ్మాయిలతో మీ జీవితాన్ని నేనూహించనా..." అని.

తడబడ్డాడు కృష్ణమూర్తి.

"గోపాలకృష్ణుడు చుట్టూవున్న రాధికల్తో, గోపికల్తో రాసక్రీడలు సలుపకుండా వుంటాడా..." అంది అతనిముఖంలోకే చూస్తూ.

ఖంగుతిన్నాడు. పాలిపోయిన ముఖానికి రక్తం రంగు పులుముకోవడానికి ప్రయత్నిస్తున్నాడు కృష్ణమూర్తి.

"అదేవిటలా అయిపోయేరు? అసలే మగవారు. అందులోకీ కృష్ణనామధారులు. అందుకే అలా అన్నాను. కొంపదీసి నిజమే నేమిటి?" అంది మళ్ళీ కవ్విస్తూను.

"ఛ ఛ..." అని మాత్రం అన్నాడు కృష్ణమూర్తి.

"ఏదేమైనా నా గురించి మీరు తెలుసుకోకుండా, మీ గురించి నేను తెలుసుకోకుండా మీరంతంత డైలాగులు మీ కథల్లోలా చెప్పేస్తే ఎలా. నా గురించి చెప్తాను. విన్నాక మీ డైలాగులు చెప్పండి. సంతోషిస్తాను..." అంది దీపిక.

"మా అక్కయ్య ఒకణ్ణి ప్రేమించాననుకుని వెళ్ళిపోయి, మోసపోయి ఆత్మహత్య చేసుకుంది. అది భరించలేని నా తల్లిదండ్రులూ వెళ్ళిపోయేరు.

పోతే ఇక్కడికొచ్చేక మీ గురించీ అలాంటి కథే విన్నాను. ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్ళిచేసుకోకపోయేసరికి ఆ పిల్ల ప్రాణం తీసుకుందని మన స్టాఫ్‌లోనే చెప్పుకుంటుండగా అనేకసార్లు విన్నాను..."

ఏమీ మాట్లాడలేకపోయేడు కృష్ణమూర్తి.

"డైలాగులు గుప్పించే నోరు మూగపోయిందేం కృష్ణమూర్తి గారూ... చెడి ప్రాణం తీసుకున్న పిల్ల చెల్లెలిని చేసుకోవడానికి మీ సాహిత్యం తెచ్చిన సంస్కారం అడ్డుపడుతుందా? ఆదరిస్తుందా?" అని నిలదీసింది దీపిక.

"మీరిష్టపడాలేగాని... మన గతాలు ఏమైనప్పటికీ మిమ్మల్ని చేసుకోవడానికి నేను సిద్ధమే..." అన్నాడు నిబ్బరంగా కృష్ణమూర్తి.

"జీవితానికి ఒకసారి కాక నెలకోసారి పదిహేను వందల కట్నం జీతం రూపంలో తెచ్చి పోస్తే ఎవరయినా చేసుకుంటారు. అయినా మరొక్క నిజం చెప్తాను. విన్నాక అప్పటికీ సిద్ధపడితే ఇంకా సంతోషిస్తాను..." అంది దీపిక అతని ముఖంలోకి చూస్తూ.

ఇరకాటంలో పడ్డట్టుగా, ఇబ్బంది పడుతూన్న కృష్ణమూర్తి ముఖమే చెప్తోంది.

"రాధిక చెల్లెల్ని నేను" అంది దీపిక.

నోరు తెరచుకుని కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయేడు కృష్ణమూర్తి.

"అవును కృష్ణమూర్తి గారూ. ఇద్దరం కలిసే పనిచేస్తున్నాంకదా... అనుక్షణం మీ కళ్ళ ఎదుట మెసుల్తున్న నాలో రాధికను చూస్తూనే వుంటారు. మీది నిజంగా నిష్కల్మష హృదయమే అయితే నిబ్బరంగా నన్ను చేపట్టతారు. లేదూ అన్యాయమే చేసివుంటే క్షోభకు గురయ్యే మీ హృదయమే ఆ విషయం చెప్తుంది. మీ నిర్ణయం ఆలోచించి చెప్పండి. నేను మాత్రం మిమ్మల్ని వదిలేది లేదు. వస్తానూ...." అంటూ చరచరా క్లాసులోకి వెళ్ళిపోతున్న దీపికను చూస్తూ బొమ్మలా వుండిపోయేడు కృష్ణమూర్తి.

*(భారతి, డిసెంబరు 1986)*